సాక్షి నిజామాబాద్

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



అద్దెకు ఆర్టీసీ బస్సు

శుభకార్యాలు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తోంది. తక్కువ చార్జీలకు అందుబాటులో ఉంచుతోంది.

- 8లో ▸



సీపీఎస్ రద్దుకు పోరాటం

సీపీఎస్ రద్దు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం పెన్షన్ విద్రోహ దినం పాటించనున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 30.5 /22.0

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

ఆవిరైన ఆశలు..

ఆమెది వ్యవసాయ కుటుంబం.. మట్టి వాసనంటే ఎంతో ఇష్టం.. అందుకే వ్యవసాయ విద్య అభ్యసిస్తానంది. ఎక్కడ సీటు వచ్చినా చదివేందుకు సిద్ధమైంది. రుద్రూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ వ్యవసాయ పాలిటెక్నిక్‌లో సీటు రావడంతో ఎంతో సంబుర పడింది. ఎన్నో కలలు కన్నది. తల్లిదండ్రులు తోడు రాగా నాలుగు రోజుల క్రితమే కాలేజీలో చేరింది. ఇంతలో ఏమైందో ఏమో.. కాలేజీ హాస్టల్ గదిలోనే ఉరి వేసుకుని బలవన్మరణం చెందింది. ఆమె తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన రక్షిత మరణం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



మృతదేహాన్ని తరలిస్తుండగా అడ్డుకుంటున్న విద్యార్థి సంఘాల నాయకులు



రక్షిత (ఫైల్)

- కాలేజీలో చేర్పించిన నాలుగు రోజులకే విద్యార్థిని ఆత్మహత్య
- రుద్రూర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలో ఘటన
- హడావుడిగా మృతదేహం తరలింపు
- కాలేజీ యాజమాన్యంపై అనుమానాలు!

రుద్రూర్: ఎన్నో ఆశలతో తమ కూతురిని కాలేజీలో చేర్పించిన తల్లిదండ్రులు నాలుగు రోజులకే ఆమె ను విగతజీవిగా చూసి బోరున విలపించారు. చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుతుందనుకున్న తమ బిడ్డ ఆత్మహత్య చేసుకుందని తెలిసి గుండెలవిసేలా రోధించారు. రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ శివారులో గల ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థిని వాడి రక్షిత(15) శనివారం ఉదయం హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకుంది. కళాశాల విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదిలాబాద్ జిల్లా ఉ ట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన రక్షిత నాలుగు రోజుల క్రితం (ఆగస్టు 27న) వ్యవసాయ పాలిటెక్నిక్ ఫస్టియర్‌లో చేరింది. కాలేజీ హాస్టల్‌లో ఉంటున్న ఆమె రోజులాగే శనివారం ఉదయం నిద్రలేచి బాత్‌రూంకు వెళ్లింది. చాలాసేపటి వరకు తిరిగి రాకపోవడంతో తోటి విద్యార్థులు బాత్‌రూం వద్దకు వెళ్లి పిలిచినా పలకలేదు. దీంతో వారు తలుపును గట్టిగా బాదడంతో కింద భాగం విరిగిపడింది. అందులో నుంచి చూడగా రక్షిత చున్నితో ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించింది. దీంతో వారు వెంటనే వార్డెన్‌కు సమాచారం అందించారు.

శుక్రవారం రాత్రి మాట్లాడాం..



నాకు ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు. రక్షితకు వ్యవసాయ విద్య అంటే ఎంతో ఇష్టం. రుద్రూర్‌లో సీటు రావడంతో ఆగస్టు 27న వచ్చి కాలేజీలో చేర్పించాం. ప్రతి రోజు ఫోన్‌లో మాట్లాడేది. శుక్రవారం రాత్రి మాట్లాడాం. శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకుందని ఫోన్ వచ్చింది. వస్తున్నామని చెప్పి వెంటనే బయలు దేరాం. మేము వచ్చే సరికి మృతదేహం తరలించడం అనుమానం కలిగిస్తోంది. కాలేజీ యాజమాన్యం, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

– విష్ణు, మృతురాలి తండ్రి

బంధువులతో కలిసి విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యార్థిని మృతిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. సీఐ జయేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో హాస్టల్ వార్డెన్, కేర్‌టేకర్, అధ్యాపకులు, విద్యార్థుల ద్వారా వివరాలు సేకరించారు. అప్పటికే కాలేజీ హాస్టల్ వద్దకు చేరుకున్న విలేకరులు, విద్యార్థి సంఘాల నాయకులను ఘటన స్థలానికి వెళ్లనీయకుండా పోలీసులు నిలిపివేశారు. పది గంటల సమయంలో మృతదేహాన్ని తరలిస్తుండగా కుటుంబ సభ్యులు వచ్చే వరకు ఆగాలని పీడీఎస్‌యూ, ఏబీవీపీ నాయకులు అడ్డుకున్నారు. అంబులెన్స్‌ను వెంబడించారు. పోలీసులు విద్యార్థి నాయకులను నెట్టివేసి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు వస్తున్నామని ఫోన్ ద్వారా సమాచారం అందించినా పట్టించుకోకుండా మృతదేహాన్ని ఎందుకు తీసుకెళ్లారని బంధువులు ప్రశ్నించారు. కళాశాల సిబ్బందిపై అనుమానం వ్యక్తం చేశారు. బాధితులకు మద్దతుగా విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల యాజమాన్యాన్ని, పోలీసులను నిలదీశారు. మృతురాలి బంధువుల డిమాండ్ మేరకు సీసీ ఫుటేజీని పరిశీలించగా శుక్రవారం నాటి డాటా లేకపోవడంతో అనుమానాలకు బలం చేకూరింది. అయితే ఎక్స్‌పర్ట్‌ను పిలిపించి డాటా తీసుకుంటామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌రావు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కాలేజీ యాజమాన్యంపై అనుమానం ఉందని మృతురాలి తండ్రి విష్ణు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

న్యూస్‌రీల్

దీపాదాస్ మున్షీని కలిసిన పోచారం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయ సలహాదారుగా తన నియామకానికి సహకరించిన దీపాదాస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి ధన్యవాదాలు తెలిపారు. తన బాధ్యతల స్వీకార కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, గాల్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి ఉన్నారు.

వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో రానున్న 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడితే కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08462 - 220183 కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కంట్రోల్ రూమ్ నిరంతరం పని చేస్తుందని, కంట్రోల్ రూమ్ ద్వారా సమాచార సేకరణ కోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వర్షాలతో ఇబ్బందులపై ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో..

నిజామాబాద్ రెవెన్యూ డివిజనల్ కా ర్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో రాజేంద్రకుమార్ శనివారం తెలిపారు. వర్షాల కారణంగా ఇబ్బందులు ఏర్పడితే కంట్రోల్ రూమ్‌కు (08462 295457) సమాచారం అందించాలని సూచించారు.

నీటి విడుదల నిలిపివేత



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ ఆయకట్టు పరిధిలోని నిజాంసాగర్, బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్, వర్ని మండలాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో సాగు నీరు వృథా కాకూడదన్న ఉద్దేశంతో ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి 1,391.51 అడుగుల(4.728 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

4న ఖో ఖో సబ్ జూనియర్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలకు సంబంధించి సబ్ జూనియర్ విభాగంలో బాల బాలికల ఎంపికలు కామారెడ్డి జిల్లా పాల్వంచ జిల్లా పరిషత్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణ కార్యదర్శి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న ఉదయం 8 గంటలకు క్రీడాకారులు హాజరు కావాలన్నారు. పాల్గొనే క్రీడాకారులు బొనాఫైడ్, ఆధార్ కార్డు, ఫొటోలు తీసుకొని రావాలన్నారు. వివరాలకు 8555996271, 7396541233 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వీసీలను నియమించాలి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వెంటనే వీసీలను నియమించాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీలో శనివారం ఆయన మాట్లాడారు. వీసీ లేక యూనివర్సిటీ అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి యూనివర్సిటీల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని పేర్కొన్నారు. నాయకులు తరుణ్, నవీన్, సాయి పవన్, అనురాగ్, ప్రమోద్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్ల ఖర్చు.. ఫలితం సున్నా

- ప్రజలకు ఉపయోగపడకుండా పోయిన ప్రజాధనం
- ఇదీ నిజామాబాద్ ఎల్లమ్మగుట్టలో పులాంగ్ వాగుపై వంతెన కథ



శంకుస్థాపనలో పాల్గొన్న అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు కవిత, గణేశ్‌గుప్తా(ఫైల్)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రజలకు ఉపయోగపడే పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని చూడాలంటే నిజామాబాద్ నగరపాలక సంస్థ అధికారుల తీరును చూడొచ్చు. నగరంలోని ఎల్లమ్మగుట్ట ఏరియాలో పులాంగ్ వంతెనపై హైలెవల్ వంతెన పనులను మధ్యలోనే వదిలేయడం నిర్లక్ష్య పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది. దీని విషయమై ప్రభుత్వానికి నివేదించి పూర్తి చేసే విషయమై ఏమాత్రం పట్టనట్లు ఉండడం గమనార్హం. మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా ఐఏఎస్ అధికారులే ఉంటున్నప్పటికీ నగరాభివృద్ధిలో పూర్తి నిర్లక్ష్యంగా ఉండటం పట్ల నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

■ ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో పులాంగ్ వాగుపై వంతెన కోసం 2018 ఏప్రిల్ 25న అప్పటి ఎంపీ కవిత, అప్పటి ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా శంకుస్థాపన చేశారు. రూ.8 కోట్ల అంచనా వ్యయంతో దీని నిర్మాణం చేపట్టారు. ఇక్కడే అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించిన ఎస్‌టీపీ (మురుగునీటి శుద్ధి ప్రక్రియ ప్లాంట్) ఉంది. దీని నిర్వహణ, పనివాళ్ల రాకపోకలకు సులభంగా ఉండేందుకు, మరోవైపు ఇక్కడి నుంచి నేరుగా మాధవనగర్‌కు వెళ్లేందుకు దూరం తగ్గుతుందనే ఆలోచనతో వంతెన మంజూరు చేశారు. ఈ వంతెన పూర్తయితే నగరం నుంచి నేరుగా మాధవనగర్‌కు వెళ్లే అవకాశముండడంతో నగరంలో సగం ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది. రూ.5 కోట్లు ఖర్చు చేసి పిల్లర్స్ నిర్మాణం పూర్తి చేశారు. దాదాపు 60 శాతం పని పూర్తయింది. పిల్లర్లపై స్లాబ్, ఫ్లోర్, అప్రోచ్ రోడ్డు వేయాల్సి ఉంది. అయితే పిల్లర్స్ నిర్మాణంతోనే పనులు నిలిచిపోయాయి. 2021లో పనులు ఆగాయి. పనులు నిలిచిపోయి మూడేళ్లు దాటడంతో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అంచనాలు మరింతగా పెంచాల్సిన దుస్థితి నెలకొంది. ఇదేవిధంగా తాత్సారం చేస్తే నిర్మించిన పిల్లర్లు సైతం శిథిలదశకు చేరుతాయని ప్రజలు అంటున్నారు. తక్షణమే నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పిల్లర్ల వరకు నిర్మించి వదిలేయడంతో పిచ్చి చెట్లతో నిండిన ప్రాంతం

జిల్లా వ్యాప్తంగా వర్షం

నిజామాబాద్ అర్బన్: జిల్లావ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 40.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వర్ని మండలం జాకొరలో 86.3 మి.మీ వర్షం కురిసింది. చందూర్‌లో 68.5 మి.మీ, ధర్పల్లిలో 48.5, వేల్పూర్‌లో 36.8, మోస్రాలో36.0, జాన్కంపేట్‌లో, తూంపల్లిలో 32.5, చీమన్‌పల్లి 29.0 రుద్రూర్‌లో 27.0, ఆర్మూర్ మండలం మగ్గిడిలో 26.3, మోపాల్ మండలం మంచిప్పలో 25.5, ఆర్మూర్ మండలం ఇస్సాపల్లిలో 25, నవీపేటలో 24.8, బాల్కొండలో 22.8, కమ్మర్‌పల్లిలో 20.0మి.మీ. వర్షపాతం నమోదైంది. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది.



అప్పు తీర్చేందుకు అప్పు

- రైతన్నలకు భారమవుతున్న బ్యాంకు బకాయిల చెల్లింపు
- రూ.2లక్షలకు మించి ఉన్న పంట రుణాన్ని చెల్లించాల్సిందే..
- ఆ తరువాతే రుణమాఫీ నిధులు జమ



మోర్తాడ్(బాల్కొండ): ఇందల్వాయి మండలం గౌరారం గ్రామానికి చెందిన రైతు మైలారం రమేశ్ రెడ్డికి సిర్నాపల్లి ఇండియన్ బ్యాంకులో రూ.3.60లక్షల పంట రుణం బకాయి ఉంది. ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణ మాఫీ సొమ్ము జమ కావాలంటే ఆ రైతు రూ.1.60లక్షలు బ్యాంకులో చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే రైతుభరోసా అందకపోవడంతో పంటల సాగుకు పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రమేశ్‌రెడ్డి.. బ్యాంకు బకాయిని కట్టేందుకు మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఒక్క రైతు రమేశ్‌రెడ్డి ఎదుర్కొంటున్న ఇబ్బంది కాదు. రుణమాఫీ సొమ్ము అందుకోవాలంటే బ్యాంకుల్లో రూ.2లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని చెల్లించేందుకు ఎంతో మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 2.50లక్షల మందికి పైగా రైతులు ఉండగా, ఇప్పటి వరకు 83,061 మందికి మాత్రమే రూ.626.49 కోట్ల రుణం మాఫీ అయ్యింది. ఒక కుటుంబానికి రూ.2లక్షల చొప్పున రుణ మాఫీ వర్తింపజేయాల్సి వస్తే ఇంకా లక్ష మందికి పైగా రైతులకు మాఫీ సొమ్మును జమ చేయాల్సి ఉంది.ఓ వైపు రూ.2లక్షల కన్నా ఎక్కువ ఉన్న మొత్తాన్ని జమ చేయాలని ప్రభుత్వం పేర్కొంటుండగా, మరో వైపు రుణమాఫీ సొమ్ము ఎప్పటిలోగా జమ చేస్తారో స్పష్టత లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.

విధానం సరిగా లేదు



రుణమాఫీ విషయంలో ప్రభుత్వ విధానం సరిగా లేదు. గతంలో అనేక మంది రైతులకు రుణం మాఫీ జరగలేదు. ఇప్పుడు నిబంధనలు సరిగా లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

– నోముల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నల్లవెల్లి

మార్గదర్శకాలు వస్తేనే...

రుణమాఫీ విషయంలో అదనపు బకాయిలు చెల్లించిన వారికి మాఫీ సొమ్ము ఎప్పుడు జమ చేస్తారనేది ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తేనే తెలుస్తుంది. రుణమాఫీ జాబితాలో పేర్లు లేనివారి దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. అదనపు బకాయిలు చెల్లించిన వారి వివరాలు కూడా సేకరిస్తున్నాం.

– శ్రీనివాస రాజు, ఏడీఏ, భీమ్‌గల్

రుణమాఫీ కాని రైతులకు ఊరట

- పేర్ల తప్పిదాలతో నష్టపోయిన వారికి అవకాశం
- ఈ నెల 7 వరకు బ్యాంకుల్లో సరిచేయనున్న అధికారులు

మోర్తాడ్: ఆధార్, బ్యాంకు ఖాతాలో ఒకే రకంగా పేరు లేకపోవడంతో రుణమాఫీ జరుగని రైతులకు ప్రభుత్వం ఊరటనిచ్చే వార్త చెప్పింది. బ్యాంకుల్లోనే రైతులు తమ ఆధార్ కార్డు ప్రకారం బ్యాంకు ఖాతాలో పేరు మార్పు చేసుకోవడానికి వీలు కల్పించింది. బ్యాంకర్లకు ప్రత్యేక లాగిన్ ఐడీ ఇవ్వడంతో ఖాతాదారుల పేర్లు సరి చేసి రుణమాఫీ కోసం వారు ప్రభుత్వానికి నివేదికను అందించనున్నారు. ఆధార్ కార్డు ప్రకారం బ్యాంకు ఖాతాలో పేరు లేకపోవడం, అక్షర దోషాలతో చాలా మంది రుణ మాఫీకి అర్హత సాధించలేకపోయారు. ఈ అంశంపై పరిశీలన జరిపిన ప్రభుత్వం సమస్యను పరిష్కరించడానికి బ్యాంకర్లకే అవకాశం కల్పించింది. ఈ నెల 7వ తేది వరకు ఆధార్, బ్యాంకు ఖాతాలో పేర్లు సరిగా లేని రైతులు సంబంధిత బ్యాంకులకు వెళ్లి సరి చేయించుకోవాల్సి ఉంది. వ్యవసాయ శాఖ కుటుంబ నిర్ధారణ ప్రక్రియనే పూర్తి చేయనుంది. బ్యాంకర్లు ఖాతాల్లో పేరు సరి చేసి నివేదిక ఇచ్చిన తర్వాత నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. దీనిపై ఏడీఏ శ్రీనివాసరాజును వివరణ కోరగా బ్యాంకుల్లో పేర్లు సరి చేసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్ నుంచి ఆయన శనివారం జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. జిల్లాలో ఎక్కడ కూడా విషజ్వరాలు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. నిలువ నీరు ఉన్న చోట, మురుగు కాలువలలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. రోజువారీగా పీహెచ్‌సీల నుంచి సీజనల్ వ్యాధులకు సంబంధించిన కేసుల వివరాలను తెప్పించుకుని, ఎక్కడైనా డెంగీ కేసులు నమోదైతే బాధితుడి ఇంటి పరిసరాల వద్ద దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్ అర్బన్: రానున్న రెండు రోజులు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయడంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ శనివారం సాయంత్రం సెల్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చెరువులకు గండ్లు పడకుండా నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా కార్యస్థానాల్లో ఉండాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగాల అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా పని చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల వద్ద బస్సులు జాగ్రత్తగా నడిపేలా ఆర్టీసీ డ్రైవర్లను అప్రమత్తం చేయాలని ఆర్ఎంకు సూచించారు. పట్టణ ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వకుండా డ్రెయినేజీలు శుభ్రం చేయించాలన్నారు. కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు పనిచేసేలా అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ఏదైనా సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వచ్చి చేరే అవకాశం ఉన్నందున శ్రీరాంసాగర్ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సెల్ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీపీవో తరుణ్ కుమార్, సీపీవో మల్లికార్జున్ పాల్గొన్నారు.

సావెల్ సొసైటీలో అక్రమాలు!

- రూ.80 లక్షలు గోల్‌మాల్

బాల్కొండ: మెండోరా మండలం సావెల్ సహకార సంఘంలో జరిగిన అక్రమాలు తాజాగా వెలుగు చూస్తున్నాయి. సొసైటీలో రూ.80 లక్షలను గోల్‌మాల్ చేశారు. సీఈవోలుగా వ్యవహరించిన అధికారులే చేతివాటం చూపడంతో సంఘం నష్టాల్లో కూరుకుపోయింది. గత పాలక వర్గం హయాంలో రూ.35 లక్షల నష్టాలు ఉంటే ప్రస్తుతం రూ.45 లక్షలు చేరి మొత్తం రూ.80 లక్షలకు నష్టాలు చేరుకున్నాయి. ప్రస్తుతం సొసైటీలో సీఈవో పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుత పాలకవర్గంలో సీఈవోగా పని చేసిన సురేందర్‌రెడ్డి అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు. దీంతో నాలుగు నెలల నుంచి నుంచి సావెల్‌లో సీఈవో లేరు. అయితే ప్రస్తుతం వేంపల్లి సహకార సంఘం కార్యదర్శి రంజిత్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడానికి ఉన్నతాధికారులు యత్నించగా.. ఆయన విముఖత చూపుతున్నారు. సావెల్‌లో పని చేయమంటే రాజీనామా చేస్తా అంటున్నారు. దీంతో నోడల్ అధికారి సుమన్ ఆయనను సముదాయించడానికి శనివారం సావెల్ వచ్చారు. ఆయన బాధ్యతలు తీసుకోవడానికి ముందుకు రాకపోవడంపై ఆరా తీయగా అక్రమాల విషయాలు వెలుగు చూశాయి. సంఘంలో జరిగిన అవినీతిని చూసి ఆయన ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకోవడానికి భయపడుతున్నారు. గత సీఈవో సురేందర్ రెడ్డి రూ.35 లక్షలు మాయం చేశాడు. ఆ డబ్బులను తానే చెల్లిస్తానని బాండ్‌పేపర్ కూడా రాసి ఇచ్చాడు. కానీ ఇంత వరకు ఒక్క రూపాయి కూడా రికవరి చేయలేదు.



వివరాలు తెలుసుకుంటున్న నోడల్ అధికారి

వారం రోజులుగా యూరియా లేదు

సహకార సంఘంలో వారం రోజుల నుంచి యూరియా అందుబాటులో లేదు. కంపెనీలకు నగదు చెల్లించక పోవడంతో యూరియా సరఫరాను నిలిపివేశారు. అయితే సొసైటీలో అవినీతి జరిగితే పాలకవర్గం ఏం చేస్తున్నట్లు అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డిని వివరణ కోరగా అవినీతిపై గతంలోనే డీసీవోకు ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 572 క్యూసెక్కులుపోతోంది. మిషన్‌ భగీరథ ద్వారా అవసరాలకు 231 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిఫ్టుకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అవుట్‌ ఫ్లో తక్కువగా ఉండటంతో ప్రాజెక్ట్‌ నీటి మట్టం పెరుగుతోంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1085.20(60.47టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

కామర్స్‌లో డాక్టరేట్‌



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కామర్స్‌ విభాగం పరిశోధక విద్యార్థి పాతులోత్‌ బీకోజీ పీహెచ్‌డీ సాధించారు. తెయూ ప్రొఫెసర్‌ రాంబాబు గోపిశెట్టి పర్యవేక్షణలో 'కస్టమర్స్‌ పర్సెప్షన్‌ టు వర్డ్స్‌ ఈ బ్యాంకింగ్‌ సర్వీసెస్‌ – ఏ కంపరేటివ్‌ స్టడీ ఆఫ్‌ పబ్లిక్‌ అండ్‌ ప్రైవేట్‌ సెక్టార్‌ బ్యాంక్స్‌' అనే అంశంపై బీకోజీ పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. శనివారం క్యాంపస్‌లో నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్‌ జే రవికుమార్‌ ఎక్స్‌టర్నల్‌ ఎగ్జామినర్‌ గా వ్యవహరించారు. డాక్టరేట్‌ సాధించిన బీకోజీని రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం యాదగిరి, అధ్యాపకులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గంగాధర్‌, జి శ్రీనివాస్‌, శ్వేత,కిరణ్‌రాథోడ్‌, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్‌' ప్రవేశాల గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువు తేదీని పొడిగించినట్లు కో ఆర్డినేటర్‌ రంజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు ఆయా కోర్సుల్లో ప్రవేశానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు 73829 29612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీపీఎస్‌ రద్దుకు పోరాటం

- ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయం
- నేడు పెన్షన్‌ విద్రోహ దినంగా నిరసన



శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఐక్యతను చాటుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

నిజామాబాద్‌అర్బన్‌: ఉమ్మడి జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్‌(కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ స్కీమ్‌) విధానానికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధమవుతున్నారు. వివిధ మార్గాల్లో పోరాటాలు చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్‌ భవనంలో శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమావేశమై సీపీఎస్‌ రద్దుకు పోరాటం చేయాలనే అభిప్రాయానికి వచ్చారు. నేడు(ఆదివారం) జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపనున్నారు.

సీపీఎస్‌పై నిరసనల పర్వం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 సెప్టెంబర్‌ 1 నుంచి ఉద్యోగం పొందిన వారికి సీపీఎస్‌ విధానం అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీపీఎస్‌ కారణంగా నష్టపోతున్నామని ఉమ్మడి జిల్లాలోని సుమారు15 వేల మంది పేర్కొంటున్నారు. ఈ విధానంలో విధుల్లో చేరిన ఉద్యోగి మూల వేతనం నుంచి 10 శాతం వాటాకు సమానమైన ప్రభుత్వ వాటాతో మార్కెట్లో పెట్టుబడిగా పెట్టి, వచ్చే లాభాల ఆధారంగా పింఛను పథకం అమలు చేస్తున్నారు. దీని ద్వారా వచ్చే బెనిఫిట్స్‌ అతి తక్కువగా ఉన్నాయి. ఈ విధానం ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. సర్వీసులో ఉండగా చనిపోతే ఉద్యోగి ఖాతాలో ఉన్న మొత్తాన్ని అతని కుటుంబానికి చెల్లించాలి, అయితే రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 300 మంది చనిపోతే ఒక్క కుటుంబానికి కూడా ఇంతవరకు సొమ్ము చెల్లించలేదు. ఈ నేపథ్యంలో సీపీఎస్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్‌ చేస్తున్నారు. లేనిపక్షంలో తమకు పోరాటలే శరణ్యమంటున్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి



పాత పింఛన్‌ విధానాన్ని పునరుద్ధరించాలి. కేంద్ర ప్రభుత్వం 2003లో తీసుకువచ్చిన సీపీఎస్‌ విధానం, వారం రోజుల క్రితం తెచ్చిన ఏకీకృత పింఛన్‌ విధానం లోపభూయిష్టంగా ఉంది. సీపీఎస్‌ రద్దు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా పోరాటాలు చేస్తాం.

– అంకం నరేశ్‌, పీఆర్టీయూ నాయకుడు

అన్యాయం చేయొద్దు



ఉద్యోగులకు సమస్యగా మారిన సీపీఎస్‌ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి. గత కొన్నేళ్లుగా నిరసన తెలుపుతున్నాం. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమ స్యలను పరిష్కరించాలి. ఉద్యోగుల భద్రతపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి.

– పెద్దోళ్ల నాగరాజు, టీఎన్జీవోస్‌ ఉపాధ్యక్షుడు

ఉద్యోగుల భద్రత ముఖ్యం



ఉద్యోగుల భద్రత ఎంతో ముఖ్యం. దీనిని దృష్టిలో ఉంచుకొని ఓపీఎస్‌ను అమలు చేయాలి. నూతన పథకాన్ని వెంటనే రద్దు చేయాలి. సీపీఎస్‌ కారణంగా చాలా నష్టం జరుగుతోంది ఇప్పటికీ కొంతమంది ఉద్యోగులకు బెనిఫిట్స్‌ అందలేదు.

– అలుక కిషన్‌, ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్‌

'ఖేలో ఇండియా' ట్రయల్స్‌కు జిల్లా క్రీడాకారులు



నిజామాబాద్‌నాగారం: ఖేలో ఇండియా జాతీయ చాంపియన్‌ షిప్‌పోటీల కోసం నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంపికలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు తైక్వాండో అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి, కోచ్‌ మనోజ్‌ తెలిపారు. శనివారం నగరంలోని బస్వాగార్డెన్స్‌లో అసోసియేషన్‌ చైర్మన్‌ బస్వా లక్ష్మీనర్సయ్య క్రీడాకారులను అభినందించారు. ఎంపికైన వారిలో నేహ, అక్షర, సమగ్ర, లక్ష్మి ఉన్నారు.

నేటి నుంచి టెన్నీకాయిట్‌ పోటీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

పెర్కిట్‌(ఆర్మూర్‌): పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 8వ అంతర్‌ జిల్లా బాల,బాలికల టెన్నీకాయిట్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు ఆదివారం ప్రారంభమవుతాయని హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య తెలిపారు. పోటీల్లో 24 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. మైదానంలో పీడీ మల్లేశ్‌ పర్యవేక్షణలో టెన్నీకాయిట్‌ కోర్టులను ఏర్పాటు చేశారు.

ఈరవత్రి కుటుంబాన్ని పరామర్శించిన ప్రముఖులు



ఆర్మూర్‌: ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రపతి అవార్డును అందుకున్న ఈరవత్రి రాందాస్‌ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో అతని కుమారుడు, చార్టెడ్‌ అకౌంటెంట్‌ ఈరవత్రి రాజశేఖర్‌తో పాటు కుటుంబ సభ్యులను శనివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్‌ మధు శేఖర్‌, చేయూత ప్రతినిధులు కలిగోట గంగాధర్‌, ఐడియా సాగర్‌ , విశాఖ గంగా రెడ్డి, కాటిపల్లి వెంకట్‌ రెడ్డి, పొల్కం నారాయణ ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించి ఈరవత్రి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హన్మంత్‌రావుకు పదోన్నతి

నిజామాబాద్‌నాగారం: రోడ్లు, భవనాల శాఖ సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ గజవాడ హన్మంత్‌రావుకు చీఫ్‌ ఇంజినీర్‌గా పదోన్నతి రావడంతో హైదరాబాద్‌లోని కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఐదు నెలల క్రితం బదిలీపై జిల్లాకు ఎస్‌ఈగా వచ్చిన హన్మంత్‌రావు గతంలో జిల్లాలోనే ఏఈగా పని చేశారు. నిజామాబాద్‌, కామారెడ్డి, బోధన్‌, సిద్దిపేట్‌, మహబుబ్‌నగర్‌, కరీంనగర్‌ జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. రాష్ట్రస్థాయిలో ఒక ఈఎన్‌సీ, ఇద్దరు సీఈలు ఉండగా అందులో నిజామాబాద్‌ జిల్లా నుంచి హన్మంత్‌రావు ఉన్నారు. ఆయన జిల్లా ఇన్‌చార్జి ఎస్‌ఈగా సైతం కొనసాగనున్నారు.

నేటి నుంచి స్కేటింగ్‌ పోటీలు

నిజామాబాద్‌ నాగారం: జిల్లా స్కేటింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో జిల్లాస్థాయి స్కేటింగ్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి రామచందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. 7–9ఏళ్లు, 9–11, 11–14, 14–17, 17 ఏళ్లకు పైబడిన విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 9182339154, 9121815515 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అద్దెకు ఆర్టీసీ బస్సు

- డిపాజిట్‌ లేకుండానే సేవలు
- అప్‌ అండ్‌ డౌన్‌ టికెట్లపై 10శాతం రాయితీ



ఖలీల్‌వాడి: కార్తీక మాసం, శుభకార్యాలు, వివాహాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను కిరాయి(అద్దె)కి ఇస్తోంది. ప్రయాణికులకు ప్రత్యేక రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రణాళిక రూపొందించిన ఆర్టీసీ.. వివాహాలు, విహార యాత్రలకు వెళ్లే వారి కోసం బస్సులను తక్కువ చార్జీకి అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టింది. ప్రైవేట్‌ వాహనాలతో పోలిస్తే తక్కువ చార్జి చేయనున్నారు. ఉమ్మడి నిజామాబాద్‌ పరిధిలోని ప్రజలు ఆర్టీసీ బస్సు సేవలను సద్వినియోగం చేసుకునేందుకు డిపో మేనేజర్లను సంప్రదించాల్సి ఉంటుంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అప్‌ అండ్‌ డౌన్‌ను ముందస్తుగా రిజర్వేషన్‌ చేసుకుంటే 10శాతం రాయితీ పొందొచ్చు.

డిపో మేనేజర్ల వివరాలు..

డిపో	సెల్‌ నంబర్‌
ఆర్మూర్‌	9959226019
బోధన్‌	9959226001
నిజామాబాద్‌–1	9959226016
నిజామాబాద్‌–2	9959226017
కామారెడ్డి	9959226018
బాన్సువాడ	9959226020

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

ఉమ్మడి నిజామాబాద్‌ ప్రజలకు ఆర్టీసీని అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తున్నాం. వివాహాలు, విహారయాత్రలకు వెళ్లేవారు ముందస్తుగా ఆర్టీసీ బస్సును బుక్‌ చేసుకోవచ్చు. బుకింగ్‌కు ఎలాంటి డిపాజిట్‌ అవసరం ఉండదు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితంగా ఉంటుంది.

– జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం, ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా

సీజీఆర్‌ఎఫ్‌ చైర్మన్‌ బాధ్యతల స్వీకరణ



నారాయణను సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నాయకులు

సుభాష్‌నగర్‌: ఉమ్మడి నిజామాబాద్‌, ఆదిలాబాద్‌, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సీజీఆర్‌ఎఫ్‌ చైర్మన్‌గా నియమితులైన ఎరుకల నారాయణ శనివారం నగరంలోని పవర్‌హౌజ్‌ ప్రాంగణంలో ఉన్న కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన నారాయణకు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సర్కిల్‌ తరఫున అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. చీఫ్‌ ఇంజినీర్‌ రామకృష్ణ, డిచ్‌పల్లి డివిజనల్‌ ఇంజినీర్‌ ఉత్తం జాడేవార్‌, రాష్ట్ర అసోసియేట్‌ ప్రెసిడెంట్‌ నాంపల్లి, జిల్లా ప్రధానకార్యదర్శి గంగారాం, నందిపేట్‌ ఏడీ అశోక్‌, నాగరాజు, చంద్రశేఖర్‌, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి

ఖలీల్‌వాడి: బాసర జోన్‌లోని నిజామాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి లభించింది. ఎస్సైలు పూర్ణేశ్వర్‌, నవీన్‌కు పదోన్నతి కల్పిస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శాసనసభ ఎన్నికల ముందు వీరికి సీఐలుగా పదోన్నతి రావాల్సి ఉండగా, కోడ్‌ కారణంగా బ్రేక్‌ పడింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- స్కూటీ అదుపుతప్పి స్కూల్‌ బస్సు కింద పడిన తండ్రి, కూతురు
- బాలికకు గాయాలు



అపర్ణను బస్సు కింది నుంచి తీస్తున్న తండ్రి

ఖలీల్‌వాడి: స్కూటీ అదుపుతప్పి తండ్రి, కూతురు స్కూల్‌ బస్సు కింద పడ్డారు. త్రుటిలో ప్రమాదం తప్పింది. నగరంలోని సుభాష్‌నగర్‌లో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రైల్వే క్వార్టర్స్‌కు చెందిన బాలిక అపర్ణ హోలీమేరీ స్కూల్‌లో పీపీ–2 చదువుతోంది. ఆమెను స్కూల్‌లో దింపేందుకు తండ్రి స్కూటీపై వెళ్తుండగా అదుపుతప్పి స్కూల్‌ బస్సుకిందపడ్డారు. డ్రైవర్‌ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిలిపివేశాడు. బాలిక చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను తండ్రి అంబులెన్స్‌లో ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించాడు. సమాచారం అందుకున్న మూడో టౌన్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీ పుటేజీని పరిశీలించారు. స్కూటీ అదుపుతప్పిన కారణంగా ఈ ఘటన చోటు చేసుకుందని, ఎలాంటి ఫిర్యాదు అందలేని ఎస్సై మహేశ్‌ తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలిక అపర్ణ



సాక్షి సండే క్లాసిఫైడ్స్‌

EDUCATION

B.ED ADMISSIONS

■ ENTRANCE లేకున్నా B.Ed మేనేజ్‌మెంట్‌ సీట్‌ ....! వాయిదాల్లో తక్కువ ఫీజు. సంప్రః J.N. B.Ed కాలేజ్‌, వేములవాడ. సెల్ః 92469 32088. [K-1246811]

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్‌ప్లేట్స్‌ & LED మిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 93105 15624, 88004 96710 [G-2157]

BUSINESS OFFER

■ We are Ready to Invest Long Term Projects All Over The World : + 918754809650 [IA-7029]

WANTED

■ Wanted Male and Female work for MNC Company Qul: 10th to Degree, Sal: 15k to 25k cont: 9030612463 (work from home facility is available) [G-9023]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌ వైజర్స్‌, నర్సులు, కాంపౌండర్స్‌, ఆయాలు, వాచ్‌మెన్స్‌, హౌస్‌కీపింగ్‌, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901. [HA-14548]

■ సైట్‌ ఇంజినీర్స్‌ (సివిల్‌, మెకానికల్‌, ఎలక్ట్రికల్‌) సైట్‌ అకౌంటెంట్స్‌/సైట్‌ సూపర్‌ వైజర్స్‌ / డ్రైవర్స్‌ కావలెను. మహారాష్ట్ర, కర్ణాటక మరియు తెలంగాణలో లిఫ్ట్‌ ఇరిగేషన్‌లో డ్రైవర్స్‌ హైవే అనుభవం ఉన్నవాళ్లు కావలెను. సంస్థ పేరు: PVC Projects, Hyd. కాల్‌: 040-23338080, adm.vineela@gmail.com. సంప్రదించు సమయం: 10am to 5pm [H-804857]

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం 18K. ఫోన్‌: 9160900024, 9840400073. [H-796271]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్‌
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్‌

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువు నీటిలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలింది. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించగా, వారు మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, చెరువుగట్టుపై మృతునివిగా భావిస్తున్న ఆకుపచ్చ, నలుపు గీతల షర్ట్‌, నీలి రంగు ప్యాంట్‌, చెప్పులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిందని, గట్టుపై లభించిన వస్తువుల ఆధారంగా మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు.

గుండెపోటుతో రైతు మృతి



మహిపాల్‌(ఫైల్‌)

ధర్పల్లి: మండలంలోని దుబ్బకు చెందిన రైతు సదు మహిపాల్‌(50) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. యూరియా కొనుగోలు చేసేందుకు గ్రామంలోని సొసైటీ గోదాం వద్దకు వెళ్లిన మహిపాల్‌.. యూరియా బస్తాలను ఆటోలో వేస్తున్న క్రమంలో కుప్పకూలాడు. వెంటనే స్థానిక వైద్యులు ఘటనాస్థలానికి చేరుకొని సీపీఆర్‌ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మహిపాల్‌ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుకున్నాయి. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..



కుర్మ హన్మయ్య మృతదేహం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసిన మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కుర్మ హన్మయ్య(77) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. తన కొడుకు మృతి చెందడంతో మానసికంగా కుంగిపోయిన హన్మయ్య గత నెల 29న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమి త్తం మెదక్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విష మించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి మనవడు సాయిబాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సిలిండర్‌ పేలి రేకుల ఇల్లు దగ్ధం



బోధన్‌రూరల్‌: సాలూర మండల కేంద్రంలోని వీకర్‌ సెక్షన్‌ కాలనీలో ప్రమాదవశాత్తు గ్యాస్‌ సిలిండర్‌ పేలి రేకుల ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన తుకారాం రేకుల ఇంట్లో అదే గ్రామానికి చెందిన పోతుగంటి వీరయ్య కుటుంబ సభ్యులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు గ్యాస్‌ సిలిండర్‌ పేలడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో దాచి డబ్బులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. మంటలు ఎగిసిపడడంతో చుట్టుపక్కల వాళ్లు ఇంట్లోని వారిని బయటికి తీసుకువచ్చారు. ఇంట్లో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు కలిసి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2.50లక్షలకు పైగా నష్టం వాటినట్లు బాధితులు తెలిపారు.

ఆటో చోరీలో అరెస్ట్‌

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌ ప్రాంతంలో ఇంటి ఎదుట పార్క్‌ చేసిన ఆటోను ఎత్తుకెళ్లిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై మహేశ్‌ తెలిపారు. గురువారం రాత్రి మహమ్మద్‌ ఇమ్రాన్‌ తన ఇంటి ఎదుట పార్క్‌ చేసిన ఆటో చోరీ కాగా, బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆటోను ఎత్తుకెళ్లిన మహారాష్ట్రకు చెందిన బాలాజీని అదుపులోకి తీసుకుని ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

దాడి కేసులో విచారణ

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్‌ చౌరస్తా వద్ద రెండు రోజుల క్రితం మధు అనే వ్యక్తిపై కత్రతో దాడి చేసిన పవన్‌ను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మధు కంటి భాగంలో తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్సై మహేశ్‌ను వివరణ కోరగా పవన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాసిన్‌ అరాఫత్‌ శనివారం తెలిపారు. అహ్మద్‌పురా కాలనీకి చెందిన పదేళ్ల బాలిక శుక్రవారం మధ్యాహ్నం కిరాణా షాపునకు వెళుతుండగా, బాసిత్‌ (50) అనే వ్యక్తి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తన తల్లిదండ్రులకు విషయం తెలుపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లాడ్జి యజమాని, కౌన్సిలర్‌పై పిటా కేసు నమోదు

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని కొత్త బస్టాండ్‌ సమీపంలో ఉన్న స్వాగత్‌ లాడ్జి యజమాని మహమూద్‌, కౌన్సిలర్‌ గంగారాంపై పిటా(ప్రివెన్షన్‌ ఆఫ్‌ ఇమ్మోరల్‌, ట్రాఫికింగ్‌) కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

కౌన్సిలర్‌ గంగారాం శుక్రవారం ఓ మహిళతో కలిసి స్వాగత్‌ లాడ్జికి వెళ్లగా, వారిని లాడ్జి యజమాని అనుమతించి సహకరించాడు. ఈ ఘటనపై సుమోటో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. లాడ్జిల్లో నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పిడుగుపాటుతో తెగిపడిన వైర్లు

- నాచుపల్లిలో విద్యుత్‌ షాక్‌తో యువతి మృతి
- నస్రుల్లాబాద్‌ మండలంలోని పలు గ్రామాల్లో పడిన పిడుగులు



స్వాతి(ఫైల్‌)

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. పిడుగుపాటు కారణంగా పశువుల కాపరికి గాయాలు కాగా, విద్యుత్‌ షాక్‌తో ఓ యువ తి మృతి చెందింది. ఆయా ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పిడుగుపాటు కారణంగా నాచుపల్లి గ్రామానికి చెందిన స్వాతి(18) అనే యువతికి చెందిన ఇంటి రేకుల పైకప్పుపై విద్యుత్‌ వైర్లు తెగిపడ్డాయి. ఇంటి తలుపు సైతం ఇనుముది కాగా, ఆమె తలుపు తీస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనాస్థలాన్ని నాయబ్‌ తహసీల్దార్‌ బావయ్య, గిర్దావార్‌ అంజు పరిశీలించారు. వారి వెంట కాంగ్రెస్‌ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్‌ శ్రీనివాస్‌, మాజీ సర్పంచ్‌ రవి ఉన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.

పశువుల కాపరికి తీవ్రగాయాలు..



గాయాలపాలైన కిమ్యానాయక్‌

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): పిడుగుపాటుతో మండలంలోని బొప్పాస్‌పల్లికి చెందిన చవాన్‌ కిమ్యా (60)కు తీవ్రగాయాలయ్యాయి. కిమ్యా శనివారం బొప్పాస్‌పల్లి విత్తనోత్పత్తి క్షేత్రం పడావు భూముల్లో పశువులను మేపుతుండగా సమీపంలోని ఓ చెట్టుపై పిడుగుపడింది. దీంతో కిమ్యా అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. సమీపంలో ఉన్న పశువుల కాపరులు గమనించి కిమ్యా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఫ్యాన్‌ రిపేర్‌ చేస్తుండగా విద్యుత్‌ షాక్‌తో మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని నాగారాం ప్రాంతానికి చెందిన ఖాలేక్‌ బిన్‌ అబ్దుల్లా(48) విద్యుత్‌ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు. అబ్దుల్లా తన ఇంట్లో ఫ్యాన్‌ రిపేర్‌ చేస్తుండగా షాక్‌ తగిలిందన్నారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సుంకెట రవి(ఫైల్‌)

కమ్మర్‌పల్లి: మండల కేంద్రం శివారులోని పాటి హనుమాన్‌ సమీపంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. కమ్మర్‌పల్లికి చెందిన సుంకెట రవి(29) మెట్‌పల్లి వైపు నుంచి కమ్మర్‌పల్లి వైపునకు ద్విచక్ర వాహనం వస్తుండగా, మెట్‌పల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రవి తల, ముఖం, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, గ్రామస్తులు అంబులెన్స్‌లో ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో చనిపోయాడు. రవి ఉన్నత విద్య అభ్యసించడానికి నాలుగేళ్ల క్రితం ఆస్ట్రేలియా వెళ్లాడు. 15 రోజుల క్రితం సొంత పనుల నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..



మారుతి (ఫైల్‌)

మోపాల్‌(నిజామాబాద్‌ రూరల్‌): మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామశివారులో ఉన్న చెరువులో పడి డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌ గ్రామానికి చెందిన నాగుల మారుతి (32) మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ శనివారం తెలిపారు. తన చిన్నమ్మ కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు మారుతి శుక్రవారం నర్సింగ్‌పల్లికి వచ్చాడు. శనివారం ఉదయం తన అన్న అజయ్‌, మరో ఇద్దరితో కలిసి మారుతి కాళ్లకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో అందరూ చూస్తుండగానే ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయాడు. పోలీసులు జాలర్ల సహాయంతో మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.